క్లుప్తంగా

ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి


కరపత్రాలను విడుదల చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

నందికొట్కూరు: ప్రభుత్వం ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా రఘురామమూర్తి అన్నారు. ఆదివారం పట్టణంలోని కర్నూలు–గుంటూరు ప్రధాన రహదారి పక్కన్న డిసెంబర్ 13న ఆటో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న రాస్తారోకోలను జయప్రదం చేయాలంటూ కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి అనారోగ్యంతో మృతి చెందితే రూ. 5 లక్షలు పరిహారం చెల్లించాలన్నారు. ప్రమాదంలో చనిపోతే రూ.10 లక్షలు బీమా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు యుగంధర్‌గౌడు, షేక్షావలి, ఈశ్వర్‌రెడ్డి, మురళి, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ మోటార్లు చోరీ

కొత్తపల్లి: మండలంలోని ఎదురుపాడు గ్రామంలో శనివారం రాత్రి కొంత మంది రైతులకు చెందిన విద్యుత్ మోటార్లను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. గ్రామానికి చెందిన కుమ్మరి సాయికృష్ణ, స్వాములు ఇరువురు కలసి 13 ఎకరాలు కౌలుకు తీసుకున్నారు. పొలంలో మొక్కజొన్న, మినుము పంటలు సాగు చేసుకుంటున్నారు. పొలంలో సాగునీటి కోసం పొలంలోని వ్యవసాయ బావికి ఏర్పాటు చేసుకున్న విద్యుత్ మోటారు, 30 మీటర్ల కేబుల్ వైరు, 30 మీటర్ల పైపు శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీచేసినట్లు తెలిపారు. వీరితో పాటు అదే గ్రామానికిచెందిన ఎర్రబండ సుబ్బారెడ్డికి చెందిన విద్యుత్ మోటారును కూడా దుండగులు దొంగలించినట్లు బాధితులు వాపోయారు. సుమారు రూ.40 వేలు నష్టం వాటిల్లిందని రైతులు తెలుపుతున్నారు. ఆదివారం బాధిత రైతులు కొత్తపల్లి పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి

ఆత్మకూరు: కేంద్రప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్, కార్యదర్శివర్గ సభ్యులు ఏసురత్నం, పట్టణ నాయకులు రామ్‌నాయక్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ధనుంజయ మీటింగ్ హాల్‌లో ఆదివారం పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం దేశంలో మతోన్మాద విధానాలను రెచ్చగొట్టడంతో పాటు కార్పొరేట్ సంస్థలకు కొమ్ము కాస్తోందన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీనాయకులు రణధీర్, సురేంద్ర, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న సేవలో సినీ దర్శకుడు


ఆలయ వెలుపల సినీ దర్శకుడు గిరీశయ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామిఅమ్మవార్లను కార్తీక మాసం చివరి ఆదివారాన్ని పురస్కరించుకుని సినీదర్శకుడు గిరీశయ దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఈయన తెలుగులో రంగ రంగ వైభవంగా, తమిళంలో అర్జున్‌రెడ్డి చిత్రాన్ని చిత్రీకరించారు. త్వరలో నూతన చిత్రాన్ని చిత్రీకరించబోతున్న సందర్భంగా శ్రీస్వామిఅమ్మవార్లను దర్శించుకుని ఆశీస్సులను పొందానని దర్శకులు తెలిపారు. ఆయన వెంట ఎస్ శంకర్ ఉన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి


రైతులకు డ్రోన్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

వెలుగోడు: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ షేక్ అమనుల్లా అన్నారు. ఆదివారం మండలంలోని రేగడగూడురు, వేల్పనూరు గ్రామాల్లో ఆదివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు అందిస్తున్న పథకాల గురించి ఏఓ పవన్ కుమార్ వివరించారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మన్ నిధి పథకం కింద ప్రతి రైతు కుటుంబానికి ఏడాదికి ఆరువేల రూపాయలు ఇస్తుందని తెలిపారు. రబీలో సాగు చేసిన పంటలు వెంటనే పంట నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వేల్పనూరు సర్పంచ్ సర్దార్ మియా, రేగడ గూడూరు సర్పంచ్ రజియాబీ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ రెడ్డి , జేసీఎస్ మండల కన్వీనర్ దేశం తిరుపంరెడ్డి, నాయకులు నందిరెడ్డిగారి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వరి కోతలు

- కంబైన్డ్ హార్వేస్టర్లను వినియోగిస్తున్న రైతులు
- 984 హెక్టార్లలో సాగు
- ఎకరాకు 30 నుంచి 40 బస్తాల దిగుబడి
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



గువ్వలకుంట్ల సమీపంలో వరిపంటను కోస్తున్న దృశ్యం, హార్వేస్టర్‌తోనే కుప్పపోసుకుంటున్న దృశ్యం

కొత్తపల్లి: మండలంలోని ఖరీఫ్ సీజన్‌లో రైతులు మొక్కజొన్న, పత్తి, మిరప, పెసర, మినుము, కంది ఇతర పంటలు సాగుచేసుకొని కోతలు కూడా పూర్తి చేసుకున్నారు. వీటితో పాటు మండలంలోని పలు ప్రాంతాల్లో వరి పంటను వేసుకున్నారు. ప్రస్తుతం కోతకు చేరుకోవరండంతో పసుపు వన్నేతో పుడమికి బంగారు వన్నే వేశారా అన్నట్లు పైర్లు కనువిందు చేస్తున్నాయి. దీంతో రైతులు కోతలు ప్రారంభించారు.

రైతన్నలు బిజీ..

మండలంలో 984 హెక్టార్లలో రైతన్నలు వరి సాగు చేశారు. ఇది ఇలా ఉండగా మండలంలో వర్షాభావ పరిస్థితుల కారణంగా ఆరుతడిపంటలు పండగ పోవడంతో ఆయకట్టు కింద రైతన్నలు వరి సాగుచేసుకున్నారు. గువ్వలకుంట్ల, వీరాపురం, కొత్తపల్లి, బావాపురం, నందికుంట, శివపురం, గుమ్మడాపురం సింగరాజు పల్లె గ్రామాలలో ఎక్కువగా రైతులు వరి ఎక్కువగా వేసుకున్నారు. పంట కాలం పూర్తయిన చోట రైతన్నలు కంబైన్డ్ హార్వేస్టర్లతో వరికోతలు మొదలు పెట్టారు. వరికోతలు కోయించడం, వాటిని కుప్పలు వేయడం, ట్రాక్టర్లతో ధాన్యాన్ని ఇళ్లకు చేర్చుకోవడంలో రైతన్నలు తలామునకలయ్యారు. వరి దిగుబడి ఎకరాకు 30 నుంచి 40 బస్తాలు వస్తుందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇది ఇలా ఉండగా ఈనెల ప్రారంభంలో తుపాన్ రావడంతో రైతన్నలు ఆందోళన చెందారు. అయితే ఈ ప్రాంతంలో ప్రభావం చూపకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. అయితే మూడు నాలుగు రోజుల పాటు కోతలకు అంతరాయం ఏర్పడింది.

దిగుబడి బాగా వచ్చింది



నాకున్న ఎకరాం పొలంలో సోనామసూరి రకం వరి సాగు చేసుకున్నా. మాకు దగ్గర్లోనే శివభాష్యం సాగర్ ప్రాజెక్ట్ ఉండడంతో సాగునీటికి ఇబ్బందిలేకుండా పొలాలకు అందింది. సాగుకోసం సుమారు రూ. 20 వేల వరకు ఖర్చుచేశా. పంట బాగా ఏపుగా పెరిగి కంకులు బాగా వచ్చాయి. ఇప్పుడు పంటలు కోతదశకు రావడంతో పంటను కోసుకున్నాను. ఎకరాకు 45 బస్తాలు వస్తోంది. నా చిన్ననాటి నుంచి ఇప్పటివరకు ఎప్పుడు ఈ దిగుబడి రాలేదు. ఒక బస్తా రూ.2100 వరకు అడుగుతున్నారు. లాభం బాగానే వస్తుందని అనుకుంటున్నా. ఇప్పుడు దిగుబడి బాగావచ్చింది. చాలా సంతోషంగా ఉంది.

– లింగస్వామి, రైతు గువ్వలకుంట్ల గ్రామం

ఊపిరి పీల్చుకున్న అన్నదాతలు

మహానంది: రాష్ట్రాన్ని అతలాకుతులం చేసిన మిచాంగ్ తుపాను ప్రభావం మహానంది, బండి ఆత్మకూరు మండలాల్లో పెద్దగా లేకపోవడంతో అన్నదాతలు ఊపిరి పీల్చుకున్నారు. రెండు మండలాల్లో అత్యధికంగా రైతులు వరి పంటను సాగు చేశారు. కొందరు రైతులు వరికోతలు పూర్తి చేసి దిగుబడులను పొలాల నుంచి తరలించుకుని అమ్ముకున్నారు. ఇంకా వేలాది ఎకరాల్లో కోతకు సిద్ధంగా ఉన్నాయి. ఇలాంటి దశలో తుపాను ప్రభావం, హెచ్చరికలతో అన్నదాతలు ఆందోళన చెందారు. అయితే అదృష్టవశాత్తు రెండు మండలాల్లో వర్షం పెద్దగా లేకపోవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. దీంతో పాటు తుఫాను నేపథ్యంలో వ్యవసాయ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు రైతులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ తమ వంతు అండగా నిలిచారు.

3,007 హెక్టార్లలో వరి సాగు..

మహానంది మండలంలో 3,007 హెక్టార్లలో వరి సాగుచేశారు. అయితే ఇప్పటి వరకు రెండు వేల హెక్టార్లలో వరి కోతలు పూర్తి కాగా మిగిలిన 1,007 హెక్టార్లలో పంట దిగుబడి కోత దశలోనే ఉంది. బండిఆత్మకూరు మండలంలో 10వేల హెక్టార్లలో వరి సాగవ్వగా 6,520 హెక్టార్లలో పంట కోతలు పూర్తి అయ్యాయి. మిగిలిన 3,480 హెక్టార్లలో కోతలు జరగాల్సి ఉంది.


బస్తాల్లో నింపుతున్న వరి ధాన్యం

నేటి నుంచి 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర'

మిడుతూరు: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో సోమవారం నుంచి వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జీఎస్ఎస్ రెడ్డి తెలిపారు. ఆదివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర షెడ్యూల్‌ను విడుదల చేశారు. 11న అలగనూరు గ్రామంలో ఉదయం 10.30 గంటలకు, రోళ్లపాడు గ్రామంలో మధ్యహ్న 2.30, 12న తలముడిపి గ్రామంలో 10.30 గంటలకు, జలకనూరు గ్రామంలో 2.30 గంటలకు కార్యక్రమం ఉంటుందన్నారు. అలాగే 13న చెరుకుచెర్లలో ఉదయం, బైరాపురంలో మధ్యాహ్నం, 14న ఉదయం తిమ్మాపురం, మధ్యాహ్నం సుంకేసుల, 15న మిడుతూరులో 10.30, పీరుసాహెబ్ పేటలో 2.30 గంటలకు సంకల్పయాత్ర నిర్వహిస్తామన్నారు, 16న ఉదయం 10.30కి మాసపేటలో, కడుమూరు 2.30, 17న ఉదయం చౌట్కూరు, మధ్యాహ్న 49 బన్నూరు, 18న ఉదయం దేవనూరు, చింతలపల్లి గ్రామంలో మధ్యాహ్నం, 19న ఉదయం పైపాలెం, నాగలూటిలో మధ్యాహ్న, 20న వీపనగండ్ల గ్రామంలో ఉదయం 10.30 గంటలకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వీఆర్వోకు పరామర్శ

పాములపాడు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన బానకచర్ల గ్రామ వీఆర్వో మద్దిలేటిని గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం నాయకులు ఆదివారం పరామర్శించారు. శనివారం నందికొట్కూరు తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన బీఎల్‌ఓల సమావేశానికి హాజరై తిరుగు ప్రయాణంలో మార్గమధ్యంలో రోడ్డు ప్రమాదానికి గురికావడం బాధాకరమని ఆ సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.

మున్సిపాలిటీకి నూతన జేసీబీ

నందికొట్కూరు: పట్టణ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు నూతన జేసీబీని కొనుగోలు చేసినట్లు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో 2020–21 15 ఆర్థిక నిధులు రూ.36 లక్షలతో కొనుగోలు చేసిన జేసీబీకి చైర్మన్ ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలోని 29 వార్డుల్లో ఎప్పటికప్పుడు పనులు చేసేందుకు జేసీబీని కొనుగోలు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రశాంతి, కౌన్సిలర్లు లాలు, హమీద్, నాయబ్, అశోక్, సురేష్, చిన్నరాజు, చాంద్‌బాషా, కో ఆప్షన్ సభ్యులు గఫార్, వైఎస్సార్‌సీపీ నాయకులు సత్యనారాయణ, పీ. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ బీమా పేదలకు అండ


ఎస్ఐసీ సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి

ఎల్ఐసీ బీమా పేదలకు అండగా నిలుస్తుందని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎల్ఐసీ బీమా పాలసీదారుల సేవా కేంద్రాన్ని మున్సిపల్ చైర్మన్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పాలసీదారులకు మెరుగైన సేవలు అందించేందుకు పట్టణంలో జీవిత బీమా పాలసీదారుల సేవా కేంద్రం అందుబాటులోకి వచ్చిందన్నారు. ఎల్ఐసీ బ్రాంచ్ నందికొట్కూరులో ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో ఎల్ఐసీ ఏజెంట్ వడ్డెమాను స్వామిదాసు, తదితరులు పాల్గొన్నారు.

నేటి కార్యక్రమాలు

ఆత్మకూరులో ఎమ్మెల్యే పర్యటన

ఆత్మకూరు: పట్టణంలో సోమవారం నిర్వహించే వివిధ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్‌మీర్, ఆదివారం తెలిపారు. ఉదయం 11 గంటలకు పార్టీ కార్యాలయంలో కార్యకర్తలకు అందుబాటులో ఉంటారన్నారు. మధ్యాహ్నం అర్బన్ కాలనీలో నిర్వహిస్తున్న వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో పాల్గొంటారని, అలాగే కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తారని చెప్పారు. అలాగే మండలంలోని సిద్దాపురం గ్రామంలో సోమవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు రాజమోహన్‌రెడ్డి తెలిపారు.

వెలుగోడులో 'వై ఏపీ నీడ్స్ జగన్'

వెలుగోడు: పట్టణంలోని 4వ సచివాలయం పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్ తెలిపారు. ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆదేశాల మేరకు 4వ సచివాలయం పరిధిలో ఇంటింటా పర్యటించి, ప్రజలకు సంక్షేమ పథకాల వల్ల పొందిన లబ్ధిని వివరిస్తామన్నారు. ప్రధాన కూడలిలో పార్టీ జెండా ఆవిష్కరణ, నాలుగున్నరేళ్ల వైఎస్ జగన్ పాలనలో ఎవరెంత లబ్ధి పొందింది వివరాలతో బోర్డు ఆవిష్కరిస్తామన్నారు.

'స్పందన'

నందికొట్కూరు రూరల్ : పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రాజశేఖర్‌బాబు తెలిపారు. ప్రజలు తమ సమస్యలు ఏవైనా ఉంటే అర్జీల రూపంలో అధికారులకు అందజేయాలని సూచించారు. కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు తప్పకుండా హాజరు కావాలన్నారు.

ప్రాతకోటలో లక్ష బిల్వార్చన

పగిడ్యాల: కార్తీక మాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకుని మండలంలోని తూర్పు, పడమర ప్రాతకోట గ్రామాల్లోని నాగేశ్వర స్వామి, అన్నపూర్ణ కాశీవిశ్వేశ్వర, నందీశ్వర స్వామి దేవాలయాల్లో లక్ష బిల్వార్చన నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏటా కార్తీక మాసం చివరి సోమవారం లక్ష బిల్వార్చన నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి రావాలని కోరారు. రాత్రి లక్ష దీపోత్సవ వేడుకలు, అభిషేకములు, పల్లకీ సేవ, ఉత్సవ మూర్తుల ఊరేగింపు ఉంటుందని తెలియజేశారు.

విద్యా, విజ్ఞాన రంగాల్లో రాణించాలి


విద్యార్థులు తయారు చేసిన సైన్స్ నమూనాలను పరిశీలిస్తున్న డీసీఓ శ్రీదేవి

జూపాడుబంగ్లా: విద్యార్థులు విద్యా, వైజ్ఞానిక రంగాల్లో రాణించాలని గురుకుల పాఠశాలల జిల్లా పర్యవేక్షణాధికారిణి శ్రీదేవి అన్నారు. ఆదివారం జూపాడుబంగ్లా గురుకుల పాఠశాలలో విద్యార్థులతో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ నమూనాలను పరిశీలించారు. ప్రయోగాల వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకొని వారిని అభినందించారు. డీసీఓ శ్రీదేవి మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేరీతిలో ప్రయోగాత్మకంగా విద్యాబోధన చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో కర్నూలు ప్రభుత్వ వైద్యశాల రేడియాలజిస్టు డాక్టర్ హరినాథ, ప్రిన్సిపాల్ సత్యనారాయణమ్మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ ఉమామహేశ్వప్ప, లక్ష్మాపురం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రవణమ్మ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థినులకు సూచనలిస్తున్న ఎంఈఓ సుభాన్

శాస్త్రవేత్తలుగా ఎదగాలి

పగిడ్యాల: భవిష్యత్తు శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఎంఈఓ సుభాన్ విద్యార్థులకు సూచించారు. ఆదివారం లక్ష్మాపురం అంచె వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనను పరిశీలించారు. విద్యార్థులు తయారు చేసిన వివిధ ప్రయోగాలను తిలకించి పలు సూచనలు చేశారు. ఎంఈఓ– 2 మురళీమోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రమణమ్మ, లెక్చరర్లు ఉమామహేశ్వరప్ప, డాక్టర్ హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

సేవలు విస్తృతం చేయాలి

నంద్యాల(వ్యవసాయం): రాయలసీమలో లయన్స్ క్లబ్ సేవలు విస్తృతం చేయాలని జిల్లా గవర్నర్ నాగేశ్వరరావు సూచించారు. ఆదివారం స్థానిక రామకృష్ణ పీజీ కళాశాలలో జరిగిన రాయలసీమ, నెల్లూరు జిల్లాలకు చెందిన లయన్స్ జిల్లా కేబినేట్ సమావేశానికి హాజరయ్యారు. ఆయన మాటాడుతూ గ్రామ ప్రజలకు విద్య, వైద్య,ఆర్థికంగా మరిన్ని సేవలను అందించాలన్నారు. క్లబ్ గవర్నర్‌లు డా. రవికృష్ణ, రామరాజు, బాలమద్దయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను పనిలో పెట్టుకుంటే శిక్షార్హులు


పిల్లలను పనుల్లో పెట్టుకోరాదని ఆటోలో ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

పగిడ్యాల: బడిఈడు పిల్లలను పనిలో పెట్టుకుంటే చట్టరీత్యా శిక్షార్హులవుతారని ఎంఈఓ సుభాన్ హెచ్చరించారు. జీఈఆర్ మిషన్ 100 శాతం సర్వేలో భాగంగా ఆదివారం పగిడ్యాలలో విస్తృత ప్రచారం నిర్వహించారు. కిరాణం దుకాణదారులు, హోటల్ యజమానులు 5 నుంచి 15 ఏళ్ల వయస్సు పిల్లలను పనుల్లో పెట్టుకుంటే విద్యా హక్కు చట్టం ప్రకారం శిక్షార్హులవుతారని అవగాహన కల్పించారు. బడిమానేసి వ్యవసాయ పనులకు వెళ్లే పిల్లల సమాచారం తెలియజేయాలని కోరారు. పదో తరగతి ఫెయిల్, పాస్ అయిన వారు ఇళ్ల వద్ద ఉండకుండా, మళ్లీ పాఠశాలకు వెళ్లి చదువుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పిస్తోందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను పనులకు పంపకుండా బడికి పంపాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ 2 మురళీమోహన్‌రెడ్డి, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక


సాయిచరణ్‌ను అభినందిస్తున్న దృశ్యం

వెలుగోడు: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి వాసం సాయి చరణ్ 33వ జాతీయ స్థాయి సబ్ జూనియర్ ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం సత్యనారాయణ రావు తెలిపారు. నవంబర్ 26 నుంచి 28వ తేదీ వరకు పల్నాడు జిల్లా నరసరావుపేటలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో కర్నూలు జిల్లా ఖోఖో జట్టు ద్వితీయస్థానంలో నిలిచింది. ఇందులో ప్రతిభ కనబరిచిన సాయిచరణ్‌ను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఇతను ఈ నెల 13 నుంచి 17వ తేదీ వరకు కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరులో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు. ఈ సందర్భంగా సాయిచరణ్‌ను పాఠశాల సిబ్బంది, ఫిజికల్ డైరెక్టర్ సురేష్ నాయుడు తదితరులు అభినందించారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

వెలుగోడు: అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.రామదాస్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. అంగన్‌వాడీలకు వేతనాలు పెంచకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్‌వాడీలకు గ్రాట్యూటీ అమలు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ. 26,000 ఇవ్వాలన్నారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు వెంకటయ్య, నబి రసూల్, కిషోర్, రహంతుల్లా, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

హక్కులపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం

నంద్యాల(అర్బన్): రాజ్యాంగం ద్వారా సంక్రమించి ప్రాథమిక హక్కులపై ప్రతి పౌరుడు అవగాహన కలిగి ఉండాలని హ్యూమన్ రైట్స్ నంద్యాల జిల్లా చైర్మన్ సురేంద్రబాబు తెలిపారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవ సందర్భంగా ఆదివారం స్థానిక కార్యాలయంలో హ్యూమన్‌రైట్స్ నంద్యాల జిల్లా సభ్యులతో కలిసి కేక్ కట్ చేశారు. సురేంద్రబాబు మాట్లాడుతూ పౌరులు తమ వ్యక్తిత్వాన్ని అభివృద్ధి చేసుకునేందుకు, బాధ్యత గల పౌరులుగా జీవించేందుకు ప్రాథమిక హక్కులు ఎంతో అవసరమన్నారు. మానవ హక్కుల ఉల్లంఘన జరిగితే ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో సంస్థ సెక్రటరీ లక్ష్మిరెడ్డి, సభ్యులు గిరిప్రసాద్, అనిల్ బాబు, సురేష్, శీను, చక్రధర్ పాల్గొన్నారు.

చదరంగం విజేతలకు బహుమతులు

నంద్యాల(న్యూటౌన్): ఆంధ్రప్రదేశ్ చెస్ సంఘం ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా సంఘం నిర్వాహణలో జిల్లా స్థాయి చదరంగం పోటీల విజేతలకు ఆదివారం పతకాలు, ట్రోఫీలు అందజేసినట్లు సంఘం అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, ప్రధాన కార్యదర్శి రామసుబ్బారెడ్డి ఆదివారం తెలిపారు. వివిధ కేటగిరీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. నంద్యాల జిల్లా స్థాయి విజేతగా సలీం, మణికుమార్, షేక్ అద్నాన్ అమీన్, దీక్షశ్రీ, యుగంధర్ నిలిచారన్నారు. సుబ్బయ్య, నంద్యాల లయన్స్ క్లబ్ కార్యదర్శి నాగరాజు, కోచ్‌లు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

నంద్యాల(అర్బన్): సామాజిక, ఆధ్యాత్మిక క్షేత్రంలో వీరశైవ జంగమలను చైతన్యవంతులుగా చేస్తూ వారిలో ఆత్మాభిమానం నింపేందుకు సంఘం కృషి చేస్తుందని నూతన అధ్యక్ష కార్యదర్శులు నరేష్, హరినాథబాబు తెలిపారు. స్థానిక ప్రథమనందీశ్వర దేవాలయంలో ఆదివారం వీరశైవ జంగమ సంక్షేమ సంఘం ఆధ్యాత్మిక, ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ట్రెజరర్‌గా శంకరయ్య, గౌరవాధ్యక్షులుగా సావిత్రమ్మ, ఉమామహేశ్వరయ్య ఎన్నికయ్యారు. కార్యక్రమంలో బసవేశ్వరయ్య, సావిత్రమ్మ, రాజేశ్వరమ్మ, శివుడు, చంద్రశేఖరయ్య, బసవరాజు, నందయ్య, విశ్వనాథ్, రాచయ్య పాల్గొన్నారు.

ప్రాచీన కళలను పరిరక్షించుకోవాలి


చిన్నారుల నాట్య ప్రదర్శన


కళాకారులతో ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి

మహానంది: ప్రాచీన కళలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మహానంది ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. తెలంగాణలోని సాంస్కృతిక విశ్వకళామండలి వ్యవస్థాపక అధ్యక్షుడు రామనర్సయ్య, కూచిపూడి నృత్య గురువు కిరణ్మయి, కుమారి సరిత ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల కళాకారులు ప్రదర్శించిన భరత నాట్యం, కూచిపూడి, కథాకేళి నృత్యాలు భక్తులను అలరించాయి. కార్యక్రమంలో కన్వీనర్ రామచంద్రుడు, ప్రముఖ వ్యాఖ్యాత శివరామిరెడ్డి, కళాకారులు రంగస్వామి, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ప్రిన్సిపాల్ జవహర్‌ను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

శ్రీశైలంప్రాజెక్ట్: మహాత్మాజ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాల 1997–98 పదో తరగతి బ్యాచ్‌కుచెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. శనివారం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాగా.. రెండో రోజు ఆదివారం పూర్వ విద్యార్థులు పాఠశాల ప్రిన్సిపాల్ జవహర్‌ను సన్మానించారు. అలాగే పాఠశాలకు కంప్యూటర్, పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మధు, డాక్టర్ కిరణ్ నాయక్, బాలకృష్ణ, ఓబులేసు, జి.మద్దిలేటి, పరమేష్, రాఘవేంద్ర, వాసు తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో మహానంది కిటకిట


కోనేరులో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు


మహానందిలో నందీశ్వరుడికి అభిషేకం చేస్తున్న ఈఓ, పండితులు

మహానంది: కార్తీకమాసం, త్రయోదశి, ఆదివారం సెలవురోజు కలిసి రావడంతో మహానంది క్షేత్రం భక్తులతో పోటెత్తింది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణాలు కిక్కిరిసిపోయాయి. వేకువజామున 4.30 గంటల నుంచి రాత్రి ఏకాంత సేవ వరకు మహానందీశ్వరస్వామి దర్శనం నిర్విరామంగా కొనసాగింది. వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. మహానందీశ్వరస్వామి దర్శనం కోసం ఆర్జిత సేవలైన శీఘ్రదర్శనం, సాధారణ దర్శనం క్యూలైన్లలో గంటల తరబడి బారులు తీరారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది ఏర్పాట్లు చేపట్టారు. భక్తులరద్దీకి అనుగుణంగా ఆలయంలో రెండవ ప్రసాదాల విక్రయకేంద్రాన్ని ఏర్పాటు చేశారు. శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు వేకువజామున 4.30 గంటలకే మహా మంగళ హారతులు చేపట్టారు. కామేశ్వరీదేవి అమ్మవారికి కుంకుమార్చన పూజలు నిర్వహించారు.

నందీశ్వరుడికి ప్రదోషకాల అభిషేకం

మహానందిలో కొలువైన మహానందీశ్వరస్వామి ముందు ఉన్న శ్రీ నందీశ్వరస్వామికి కార్తీకమాసం, బహుళ త్రయోదశి సందర్భంగా ఆదివారం సాయంత్రం ప్రదోష కాలంలో అభిషేకం పూజలు వైభవంగా జరిగాయి. వేదపండితులు రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, అర్చకులు నందీశ్వరుడికి పాలాభిషేకం, పంచామృతాభిషేకం, ప్రదోష కాల అభిషేకం పూజలు వైభవంగా చేపట్టారు. పూజల్లో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సతీమణి ఉమామహేశ్వరమ్మ, ప్రముఖ దాతలు పోగుల మహేశ్వరరెడ్డి, పాల్గొన్నారు.

ఓంకారంలో భక్తజన సందడి

బండిఆత్మకూరు మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన ఓంకారంలో భక్తుల సందడి నెలకొంది. సెలవురోజు కావడంతో వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు శ్రీ గంగా, ఉమా సమేత ఓంకార సిద్దేశ్వరస్వామిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు.